అఖండ విజయం కోసమే..

బాలకృష్ణ, కె.ఎస్.రవీంద్ర(బాబీ) కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రంపై అభిమానుల్లో అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ సినిమా తాజా అప్‌డేట్ కోసం ప్రేక్షకులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. సంక్రాంతి కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వార్తలొస్తున్నాయి. అయితే.. అందులో నిజం లేదని తెలుస్తున్నది. షూటింగ్ ఇప్పటికే చాలావరకూ పూర్తయింది. అందుకే.. ఆలస్యం చేయకుండా డిసెంబర్ 2నే సినిమా విడుదల చేయాలని నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య భావిస్తున్నారట. బాలయ్య 'అఖండ' విడుదలైంది కూడా ఇదే తేదీన కావడం విశేషం. దాంతో సెంటిమెంట్‌గా కూడా 'డిసెంబర్ 2' బాగా కలిసొస్తుందని మేకర్స్ భావిస్తున్నారట. బాబీడియోల్ ప్రతినాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో ఊర్వశీరౌతేలా, పాయల్‌రాజ్‌పుత్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: తమన్.

గూఢచారి-2 బడ్జెట్ 100 కోట్లు

'గూఢచారి' సినిమాతో హీరోగా తొలి విజయాన్ని అందుకున్న అడివిశేషు.. 'మేజర్'తో మేజర్ హిట్ కైవసం చేసుకొని స్టార్ హీరోల్లో ఒకడిగా అవతరించారు. ప్రస్తుతం ఆయన 'గూఢచారి-2' చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే. 'గూఢచారి 1' చిత్రానికి ఎడిటర్‌గా పని చేసిన వినయ్‌కుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండటం విశేషం. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఈ సినిమాకు వందకోట్ల బడ్జెట్ కేటాయించినట్టు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ ఇమ్రాన్ హష్మీ కీలక పాత్ర పోషిస్తున్నట్టు వారు తెలిపారు. ఇమ్రాన్ ఇమేజ్ పాన్‌ఇండియా మార్కెట్‌కి కలిసొస్తుందని చిత్ర యూనిట్ గట్టిగా నమ్ముతున్నది. వచ్చే ఏడాది వేసవిలో విడుదల కానున్న ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ కలిసి నిర్మిస్తున్నారు.

యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'కుంభ'

వి.సముద్ర స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'కుంభ'. విజయ్‌రామ్ హీరోగా పరిచయం అవుతున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్ ఫిల్మ్‌నగర్ దైవ సన్నిధానంలో ఘనంగా జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత డీఎస్‌రావు క్లాప్ ఇవ్వగా, సముద్ర సతీమణి విజయలక్ష్మి కెమెరా స్విచాన్ చేశారు. తొలి సన్నివేశానికి చంద్రమహేశ్, దేవి ప్రసాద్ గౌరవ దర్శకత్వం వహించారు. సినిమా బాగా రావాలని, మంచి విజయం సాధించాలని అతిథులంతా ఆకాంక్షించారు. 'కథలను నమ్మి కొత్తవాళ్లతో అయిదు సినిమాలు చేస్తున్నా. అందులో 'కుంభ' ఒకటి. పాన్ ఇండియా స్థాయిలో చేస్తున్న సినిమా ఇది.' అని సముద్ర తెలిపారు. అవకాశం ఇచ్చిన దర్శకనిర్మాత సముద్రకు హీరో విజయ్‌రామ్ కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు. సూరజ్ ఆదిత్యసింగ్, జ్యోతి యాదవ్, రవి జంగ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శ్రీవెంకట్, సంగీతం: వరంగల్ శ్రీను.

అద్దె ఇంటికి షిఫ్ట్ అయ్యింది

బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ లీసెంట్‌గా ఓ అద్దె ఇంట్లోకి సామాన్లతో సహా షిఫ్ట్ అయ్యింది. అంత పెద్ద హీరోయిన్ అద్దె ఇంటికి షిఫ్ట్ అవ్వడమేంటి? అనుకుంటున్నారా! వివరాల్లోకెళ్తే.. ముంబైలోని జుహూ ప్రాంతంలో 1987లోనే శ్రద్ధా తండ్రి శక్తి కపూర్ ఓ ఇంటిని కొన్నారు. మొన్నటివరకూ ఆ ఇంట్లోనే తండ్రితోపాటు శ్రద్ధా ఉండేది. ఆ ఇల్లు కట్టి 37ఏళ్లు అవుతున్నా.. ఇంకా పటిష్టంగానే ఉండటం గమనార్హం. అయితే.. ఇల్లు పాత బడిపోవడం, ట్రెండ్‌కి తగ్గట్టు లేకపోవడం, దానికి తోడు పాతకాలం నాటి డిజైన్లు. అందుకే.. ఆ ఇంటిని మోడ్రనేట్ చేయాలని శ్రద్ధా భావించింది. తండ్రి నుంచి అనుమతి తీసుకొని ఇంటి రెన్నోవేషన్ పనులు మొదలుపెట్టింది. ఇందులో భాగంగానే సామాన్లతో సహా ఇంటిని ఖాళీ చేసి వేరే ఇంటికి షిఫ్ట్ అయ్యింది. శ్రద్ధ కొత్తగా చేరిన ఇల్లు కూడా ఎవరిదోకాదు. హీరో హృతిక్ రోషన్‌ది. ఇంటి రెన్నోవేషన్ పూర్తయ్యే వరకూ జుహూ ప్రాంతంలోనే బీచ్‌కి అభిముఖంగా ఖాళీగా ఉన్న హృతిక్ ఇంట్లోకి అద్దెకు దిగింది శ్రద్ధా కపూర్. బాలీవుడ్ సూపర్‌స్టార్ అక్షయ్ కుమార్ ఇల్లు కూడా ఆ ఇంటి పక్కనే కావడం విశేషం. ఇదిలావుంటే.. శద్ధ కపూర్ కథానాయికగా నటించిన 'స్త్రీ 2' చిత్రం ఇప్పటికే 500కోట్ల క్లబ్‌లో చేరి, విజయవంతంగా ప్రదర్శించబడుతున్నది. ఈ సినిమాకోసం శ్రద్ధకు కిచ్చిన రెమ్యునరేషన్‌తో పాటు, సినిమా లాభాల్లో నుంచి కూడా కొంత వాటా ఇవ్వాలని నిర్మాతలు భావిస్తున్నారట.

ఇండియన్ స్క్రీన్‌పై రాని కాన్సెప్ట్

యువహీరో శ్రీవిష్ణు నటిస్తున్న తాజా చిత్రం 'స్వాగ్'. హసిత్‌గోలి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచారు. గురువారం టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో కింగ్, భవభూతి, సింగ, యయాతిగా నాలుగు పాత్రల్లో శ్రీవిష్ణు కనిపించాడు. పురుష ద్వేషి అయిన రాణీ రుక్మిణీ దేవిగా రీతూవర్మ కనిపించింది. టీజర్ ఆద్యంతం హాస్యప్రధానంగా సాగింది. ఈ సందర్భంగా శ్రీవిష్ణు మాట్లాడుతూ 'ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటివరకు రానటువంటి కథ. శ్వాగణిక వంశం నేపథ్యంలో ఆసక్తికరమైన మలుపులతో సాగుతుంది' అన్నారు. వినూత్నమైన కాన్సెప్ట్‌తో చిత్రాన్ని తెరకెక్కించామని, త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ తెలిపారు. తరాలుగా వస్తున్న లింగ వివక్ష అనే కాన్సెప్ట్‌తో వినోదాత్మకంగా చిత్రాన్ని తీశామని, కుటుంబంతో కలిసి హాయిగా నవ్వుకునే విధంగా ఉంటుందని దర్శకుడు హసిత్ గోలి అన్నారు. మీరా జాస్మిన్, దక్ష నాగర్కర్, శరణ్య ప్రదీప్, సునీల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్, రచన-దర్శకత్వం: హసిత్‌గోలి.

స్టైల్‌కి చిరునామా

అక్కినేని నాగార్జున ప్రత్యేక పాత్రలో ధనుష్ కథానాయకుడిగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'కుబేర'. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. గురువారం అక్కినేని నాగార్జున పుట్టిన రోజు సందర్భంగా మేకర్స్ సినిమాలోని నాగ్ సరికొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో నాగార్జున న్యూలుక్‌తో స్టైలిష్‌గా ఎదురుగా ఉన్నవారిని ఆప్యాయంగా పలకరిస్తూ కనిపిస్తున్నారు. దర్శకుడు శేఖర్ కమ్ముల విభిన్న కథాంశంతో ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నారు. హైబడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా పాన్‌ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. జిమ్ సర్భ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, నిర్మాణం: శ్రీవేంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి, అమిగోస్ క్రియేషన్స్ ప్రై.లిమిలిటెడ్.

'కూలీ'లో సైమన్ పాత్రలో..

రజనీకాంత్ కథానాయకుడిగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కూలీ'. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నాగార్జున అతిథి పాత్రలో నటిస్తున్నారు. గురువారం ఆయన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన సైమన్ అనే పాత్రలో కనిపించనున్నారు. నాగార్జున పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుందని చిత్రబృందం పేర్కొంది.

తెలుగుభాషకు మేం ఇస్తున్న జ్ఞాపిక

'సినిమా కథానేపథ్యాన్ని ప్రకటించడం కోసమే తెలుగు భాషాదినోత్సవం రోజైన ఈనాడు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాం. 1980 టైమ్‌లో జరిగే కథ ఇది. తెలుగు భాష, సంస్కృతి, తెలుగు జాతి నేపథ్యాల్లో ఈ కథ నడుస్తుంది. అందుకని మేం సందేశాలివ్వడం లేదు. కావాల్సినన్ని వాణిజ్య విలువలు ఉంటాయి. ఇందులోని కొన్ని సన్నివేశాలను, భావోద్వేగాలను పద్యరూపంలో కూడా ప్రకటించడం జరుగుతుంది. తెలుగు భాషకు మేం ఇస్తున్న ఓ జ్ఞాపిక లాంటి సినిమా ఇది. త్వరలోనే మా చిత్ర కథానాయకుడు నందమూరి తారక రామారావుని పరిచయం చేస్తాం' అని వైవీఎస్ చౌదరి చెప్పారు. నందమూరి హరికృష్ణ మనవడు, జానకిరామ్ తనయుడు నందమూరి తారకరామారావుని కథానాయకుడిగా పరిచయం చేస్తూ, వైవీఎస్ చౌదరి దర్శకత్వంలో యలమంచిలి గీత ఓ చిత్రాన్ని నిర్మించనున్నది. తెలుగమ్మాయి వీణా రావ్ కథానాయిక. తెలుగుభాష దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రెస్‌మీట్‌లో వైవీఎస్ చౌదరి మాట్లాడారు. ఇంకా ఈ చిత్ర గీత రచయిత చంద్రబోస్, మాటల రచయిత సాయిమాధవ్ బుర్రా, నిర్మాత యలమంచిలి గీత, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేశ్ అత్తిలి కూడా మాట్లాడారు. త్వరలో షూటింగ్ మొదలుకానున్న ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం.కీరవాణి, నిర్మాణం: న్యూ టాలెంట్ రోర్స్.